ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 103 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 25 జులై 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# యూకే-భారత్ వాణిజ్య ఒప్పందంతో కొత్త అధ్యాయం ప్రారంభం

## ప్రధాని మోదీ

**భారత్- బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు పూర్తి**

**ఒప్పందంపై సంతకాలు చేసిన ప్రధానులు మోదీ, స్టార్మర్**




**న్యూఢిల్లీ, జులై 24 (ప్రభాత ఉదయం)**

భారత్- బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో రెండు దేశాల వాణిజ్య మంత్రులు పీయూష్ గోయల్, జోనాథన్ రేనాల్ట్స్ %ఖీూా%పై సంతకాలు చేశారు. ఒప్పందంతో రెండు దేశాల మధ్య వాణిజ్యం 34బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఒప్పందంపై సంతకాలు చేసిన అనంతరం మాట్లాడిన ప్రధాని మోదీ, భారత్-బ్రిటన్ భాగస్వామ్యంలో విజన్-2035 లక్ష్యంగా సాగుతున్నామని అన్నారు. బ్రిటన్, భారత్ భాగస్వామ్యంతో కొత్త అధ్యాయం ప్రారంభమవుతోందని తెలిపారు. రక్షణ, భద్రత, ఏఐ, విద్య తదితర రంగాల్లో బ్రిటన్, భారత్ కొత్తపుంతలు తొక్కనుందని అభిప్రాయపడ్డారు. ఆరు బ్రిటన్ వర్సిటీలు భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నాయని వెల్లడించారు.

"ఇరుదేశాల సంబంధాల్లో ఇది చారిత్రాత్మక రోజు. నాకు సంతోషంగా ఉంది. కొన్నేళ్ల తర్వాత ఇరుదేశాల మధ్య సమగ్ర ఆర్థిక వాణిజ్య ఒప్పందం

..మిగతా 2లో

# రాహుల్ డిమాండ్‌తో దిగొచ్చిన కేంద్రం



**జనగణనతో పాటు కులగణనకు సర్కార్ నిర్ణయం**

**బిసిల రిజర్వేషన్లు ఆమోదించేలా కేంద్రంపై పోరాటం**

**కులగణనపై సీఎం రేవంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

**కులగణన సర్వే నిర్వహించడం అంత తేలిక కాదు**

**తెలంగాణలో రేవంత్ అంచనాలకు మించి రాణించారు**

**సర్వేపై ఇచ్చిన ప్రజెంటేషన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్**

**న్యూఢిల్లీ జూలై 24 (ప్రభాత ఉదయం)**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఇప్పటివరకు కులగణన జరగలేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాహుల్ లక్ష్యం మేరకు తెలంగాణలో సమగ్ర కులగణనను చేపట్టామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా

..మిగతా 2లో



# దేశానికి ఆదర్శంగా తెలంగాణ ఆర్థిక, సామాజిక సర్వే

## రాహుల్, ఖర్గేలతో సీఎం రేవంత్, భట్టి తదితరుల భేటీ

**రాష్ట్రపతి అనుమతి కోసం ఎదురు చూస్తున్న బీసీ బిల్లు**

**ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించిన మల్లికార్జున ఖర్గే**

**న్యూఢిల్లీ జూలై 24 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేస్తోందని తెలిపారు. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోందని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ప్రయత్నంలో కృషి చేసిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని బృందానికి మల్లికార్జున ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రిమండలి, ఎంపీలకు ఖర్గే ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మల్లికార్జున ఖర్గే పోస్ట్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమాన్ని ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమని నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతర పోరాటం చేస్తోందని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా పక్కకు నెట్టివేయబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గళంగా కాంగ్రెస్

..మిగతా 2లో



## రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

**అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు**

**ఢిల్లీ నుంచే కలెక్టర్లతో సిఎం రేవంత్ సమీక్ష**

**న్యూఢిల్లీ, జులై 24 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో మాట్లాడారు. తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. దిల్లీ నుంచే సీఎంవో అధికారులతో మాట్లాడారు. అన్ని జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేలా

..మిగతా 2లో

# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

**దేశ జీడీపీలో 5 శాతానికి పైగా తెలంగాణ వాటా**

**ఇదే లక్ష్యంతో ముందుకు వెళుతున్నప్రభుత్వం**

**ఈ లక్ష్యసాధనలో పెట్టుబడులు పెట్టండి**

**ఇన్వెస్టోపియా గ్లోబల్' సమ్మిట్‌లో ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, జులై 24 (ప్రభాత ఉదయం)**

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దాలనేదే మా ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ-, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో పాలుపంచుకోవాలని యూఏఈ పారిశ్రామికవేత్తలను శ్రీధర్ బాబు కోరారు. గురువారం హెచ్ఐసీసీలో యూఏఈ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్' సమ్మిట్‌లోమాట్లాడారు. అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 'భౌగోళికంగా చిన్నదైనా, ఆశయాలు, ఆచరణలో మాత్రం తెలంగాణ చాలా పెద్దది. స్వల్ప కాలంలోనే ఫీనిక్స్ పక్షిలా ఎదిగి ఇతర రాష్ట్రాలకు అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలిచింది. 2024-25లో జీఎస్‌డీపీలో 8.2 శాతం వృద్ధి నమోదైంది. ఇది జాతీయ సగటు-(7.6శాతం) కంటే ఎక్కువ. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతానికి పైగా

..మిగతా 2లో



# అమెరికన్లకు ఉద్యోగాలపై ఫోకస్ పెట్టాలి

**భారత టెక్కీలను దూరం పెట్టండి గూగుల్, మైక్రోసాఫ్ట్‌లకు ట్రంప్ సూచన**

**వాషింగ్టన్, జులై 24 (ప్రభాత ఉదయం)**

గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి మేటి టెకీ కంపెనీలకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. విదేశీ ఉద్యోగులను తీసుకోవడం ఆపేయాలన్నారు. ముఖ్యంగా ఇండియా లాంటి దేశం నుంచి టెకీలను రిక్రూట్ చేసుకోవద్దు అన్నారు. వాషింగ్టన్‌లో జరిగిన ఏఐ సదస్సులో ఆయన మాట్లాడారు. అమెరికా

..మిగతా 2లో

# రాహుల్ డిమాండ్‌తో దిగొచ్చిన కేంద్రం

మొదటి పేజీ తరువాయి...

కులగణన చేస్తామని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించారని గుర్తుచేశారు. రాహుల్ ఒత్తిడితోనేకేంద్రం దిగివచ్చిన జనగణనతో పాటు, కులగణనకు అంగీకరించిందని అన్నారు. రాహుల్ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వే చేసిందని చెప్పారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వేపై దిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎంపీలు, నేతలకు సీఎం రేవంత్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తెలంగాణలో కులగణన సర్వే పక్రియను 2024లో మేం ప్రారంభించాం. తెలంగాణలో సామాజిక, ఆర్థిక, కుల, రాజకీయ సర్వే సమగ్రంగా జరిగింది. ఇది 88 కోట్ల పేజీల్లో నిక్షిప్తమైంది. ప్రధాని మోదీకి బీసీలపై నిజమైన ప్రేమ లేదు. కొన్ని విషయాల్లో మోదీ సర్కార్ దిగివచ్చేలా రాహుల్‌గాంధీ పోరాటం చేశారు. ఆయన పోరాడినందువల్లే మూడు రైతు చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. కులగణన చేసేందుకు కూడా దిగి వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగాప్రధాని మోడీపై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ బీసీ కాదని, ఆయన కన్వర్టెడ్ ఓబీసీ అంటూ కామెంట్స్ చేశారు. కన్వర్టెడ్ అయిన మోడీ బీసీల కోసం ఏం చేయరని విమర్శించారు. బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ కుల గణనకు వ్యతిరేకమని ఆరోపించారు. భారత్ జోడో యాత్రలో కుల గణన చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని ఆయన మాట ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కుల గణన సర్వే విజయవంతంగా నిర్వహించా మన్నారు.రాహుల్ గాంధీ మాటే తమకు లక్ష్మణ రేఖ అని స్పష్టం చేశారు. దేశానికి ఒక దిశను చూపించేలా కులగణన సర్వే చేశామని, తద్వారా కుల గణనపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. మొదటి నుంచి క్యాస్ట్ సెన్సస్‌కు వ్యతిరేకంగా ఉన్న బీజేపీని తెలంగాణలో విజయవంతంగా కుల గణన పూర్తి చేసి మన దారిలోకి తీసుకొచ్చామని చెప్పారు. చివరకు జనగణనలో కుల గణన చేసేలా ప్రధాని మోడీ అంగీకరించక తప్పని పరిస్థితి తెచ్చామన్నారు. మొత్తానికి మోడీని రాహుల్ గాంధీ రూట్లోకి తీసుకురాగలిగామని.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్త జనగణనలో కుల గణన చేయాలని నిర్ణయించడం రాహుల్ గాంధీ సక్సెస్ అని అన్నారు. తెలంగాణ మోడల్ ను వివిధ రాష్ట్రాల్లో ఎంపీలు చెప్పాలనదే మా ఆలోచన అని.. అందుకోసమే ఈ పవర్ పాయింట్ ప్రజంటేషన్ అన్నారు. కులగణన కేవలం సర్వేనే కాదని.. ఇది సొసైటి మెగా హెల్త్ చెకప్ అని అభివర్ణించారు. కుల గణన సర్వే ఆధారంగా తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించామని.. ఇందుకు ఉద్దేశించిన మూడు బిల్లులను అసెంబ్లీలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ బిల్లుల ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని మీరే ఒప్పించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంపై పార్లమెంట్లో మీరు కొట్లాడండి.. బయట జంతర్ మంతర్ దగ్గర మేం కొట్లాడుతామన్నారు. కులగణనపై సోనియా గాంధీ ఇచ్చిన లేఖ నాకు సర్వస్వమని అన్నారు. కుల గణన సర్వేలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వివరాలు ఇవ్వలేదని వారి ముగ్గురిని తెలంగాణ జనభా నుంచి తీసేశామన్నారు. అంతకుముందు తెలంగాణ డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.మీ తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే ఇవాళ దేశానికి దిక్సూచిగా మారిందని అన్నారు. రాహుల్ గాంధీ హామీ మేరకు రాష్ట్రం అధికారంలోకి రాగానే కులగణన చేపట్టామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి 150 ఇళ్లను ఒక బ్లాక్‌గా ఈవిభజించి సమగ్రమైన సర్వే నిర్వహించినట్లు వివరించారు. కాంగ్రెస్ ఒత్తిడితో దేశ వ్యాప్తంగా కులగణన చేసేందుకు కేంద్రం దిగి వచ్చిందని తెలిపారు.

## యూకే-భారత్ వాణిజ్య ఒప్పందంతో కొత్త అధ్యాయం ప్రారంభం

మొదటి పేజీ తరువాయి...

జరిగింది. ఈ ఒప్పందం కేవలం ఆర్థికపరమైనదే కాదు. సహజ సమృద్ధి పథకం కూడా. అంతేకాకుండా భారతీయ వస్త్ర, ఫుట్‌వేర్, జెమ్స్-జ్యువెలరీ, సముద్ర ఆహారం, ఇంజనీరింగ్ వస్తువులకు బ్రిటన్‌లో మార్కెట్ అవకాశాలు పెరగనున్నాయి. భారత్‌కు చెందిన వ్యవసాయం, ప్రాసెసింగ్ పరిశ్రమలకు బ్రిటన్ మార్కెట్‌లో కొత్త అవకాశాలు లభించనున్నాయి. భారత్‌కు చెందిన యువత, రైతులు, జాలర్లు, ఎంఎస్ఎంఈ రంగానికి ఈ ఒప్పందం ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. మరోవైపు భారత ప్రజలు, పరిశ్రమలకు బ్రిటన్‌లో తయారయ్యే మెడికల్ పరికరాలు, ఎయిరోస్పేస్ పరికరాలు సులభంగా తక్కువ ధరకు లభించనున్నాయి." అని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ నుంచి వెళ్లే 99శాతం ఎగుమతులపై సుంకాలు తగ్గనున్నాయి. ఫలితంగా భారతీయ వ్యాపారులకు భారీగా లబ్ధి చేకూరనుంది. అలాగే బ్రిటన్ నుంచి భారత్‌కు కార్లు, కాస్మోటిక్స్, విస్కీ వంటివి దిగుమతి కానున్నాయి. కాగా, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్-యూకే మధ్య మూడేళ్లకు పైగా చర్చలు జరిగాయి. ఈయూ నుంచి నిష్క్రమించిన తర్వాత భారత్‌తో చేసుకున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం బ్రిటన్‌కు ఆర్థికంగా ఎంతో కీలకం కానుంది. భారత్‌తో మైలురాయిగా నిలిచే వాణిజ్యం ఒప్పందం బ్రిటన్‌కు పెద్ద విజయమని ప్రధాని కీర్ స్టార్మర్ సంతోషం వ్యక్తం చేశారు.

## 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి...

ఉంది అందుకే తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 టిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రభుత్వ సంకల్పమని శ్రీధర్‌బాబు అన్నారు.రాష్ట్రంలో డ్రై పోర్టులు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాం. నెట్-జీరో పారిశ్రామిక పార్కులు, ఈవీ జోన్లు, గ్రీన్ లాజిస్టిక్ హబ్‌లు, రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్), మెట్రో ఫేజ్ - 2 వంటి ప్రాజెక్టులు పారిశ్రామికా భివృద్ధికి మరింత ప్రోత్సాహం ఇవ్వనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయబోతున్న ఫ్యూచర్ సిటీ-.. ఫిన్టెక్, క్లైమేట్‌టె-క్, స్మార్ట్ మొబిలిటీ- ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా మారబోతోంది. డేటా సెంటర్లు, గ్లోబల్ క్యాపబిలిటీ- సెంటర్లు, ఏఐ ల్యాబ్‌లు, ఏరోస్పేస్ క్లస్టర్లలో వేగవంతమైన వృద్ధి నమోదవుతోంది. ఏడాదన్నర వ్యవధిలో కొత్తగా 3.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాం. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో యూఏఈకి తెలంగాణ ఎగుమతులు 2.5 రెట్లు- పెరిగాయి. ఇందులో ఫార్మా, ఏరోస్పేస్, డిజిటల్ సేవలు, ఫుడ్ ప్రాసెసింగ్ కీలక పాత్ర పోషించాయి. ఇప్పటికే యూఏఈకి చెందిన లులు గ్రూప్, డీపీ వరల్డ్, నాఫ్కో వంటి కంపెనీలు ఇక్కడ పెట్టు-బడులు పెట్టాయి. మరింత మంది పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. యూఏఈ మాదిరిగానే తెలంగాణ కూడా సమయం, నమ్మకం, పరివర్తనకు విలువ ఇస్తుంది. ఇక్కడ ఏఐ, లైఫ్ సైన్సెస్, గ్రీన్ హైడ్రోజన్, లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రో ఎగుమతులు, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.

## దేశానికి ఆదర్శంగా తెలంగాణ ఆర్థిక, సామాజిక సర్వే

మొదటి పేజీ తరువాయి...

పనిచేస్తోందని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. దేశ జనాభాలో మెజార్టీ సంఖ్య అయినా కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యాసంస్థల్లో వర్ణహీనత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో కూడా అన్యాయం జరుగుతోందని, ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తుచేశారు. 80 శాతం ఓబీసీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అలాగే 83 శాతం ఎస్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఒత్తిడికి లోన్కై కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపిందని, కానీ 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎందుకు తొలగించలేదని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గొంతుకగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని పేర్కొన్నారు. దేశ జనాభాలో మెజారిటీగా ఉన్న కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యా సంస్థల్లో వివక్ష కొనసాగుతోందన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లోనూ అన్యాయం జరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ప్రజల ఒత్తిడితోనే కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కానీ, 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించలేదు. ఢిల్లీలో ఏఐసీసీ నేత మల్లికార్జున ఖర్గే నివాసంలో ఆయనతోపాటు- రాహుల్ గాంధీని తెలంగాణ నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చలు చేపట్టారు. అంతేకాకుండా 50శాతం రిజర్వేషన్ నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రజల ఒత్తిడికి లోన్కై కుల గణన నిర్వహించేందుకు అంగీకరించినా, 50 శాతం పరిమితిని తొలగించడానికి సిద్ధంగా లేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా సంస్థలలో ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్లు సిఫారసు చేసిందని.. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తున్నదని ఆయన గుర్తు చేశారు.

## రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి...

దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలి. నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలి. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. ప్రజలకు సాయం చేసేందుకు అధికారులు జిల్లాల్లోనే అందుబాటులో ఉండాలని సీఎం రేవంత్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, లోతట్టు- ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నందున చెర్వులు, కుంటలు నిండి వరద నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. భారీ వర్ష సూచన ఉన్న జిల్లాల్లో కలెక్టర్లు అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎం ఆదేశించారు. ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## ఎన్ఐఆర్ డీపీఆర్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలోనే ఉంచాలి

### పార్లమెంటు స్థాయి సంఘం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు

బుద్వేల్, జూలై24(ప్రభాత ఉదయం) కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి రాజేంద్రనగర్ లోనిజాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్డీపీఆర్) ను వేరు చేయవద్దని గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి నివేధిక అందజేసింది. ఈ విషయాన్ని గురువారం ఎన్ఐఆర్డీపీఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కె.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు మహమూద్ అలీ, బీడీవీకే మూర్తి, ప్రధాన కార్యదర్శి ఎ.పరశురాముడు, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఉపేందర్ రాణా. కె. గాయత్రి ప్రభ, కార్యనిర్వాహక కార్యదర్శి జి.శివయ్య లు, అకాడమిక్ అసోసియేషన్ ప్రతినిధులు మీడియా కు వెల్లడించారు. ఎన్ఐఆర్డీపీఆర్ బలోపేతానికి వ్యూహాత్మక సం స్కరణలు చేపట్టాలని, అధికారుల మార్పు జరగాలని, పూర్తి స్థాయి నియామకాలను చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసిందన్నారు. 2025 జూలై 22న పార్లమెంటు లో గ్రామీణాభివృద్ధిపై ఏర్పడిన పార్లమెంటరీ స్థాయి సంఘం చైర్మన్ గా ఉన్న కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర ఉలక అధ్యక్షతన ప్రవేశపెట్టిన తమ 10వ నివేదికలో 2020 లో వ్యయ విభాగం (డీఓఈ) చేసిన సిఫార్సు లు తప్పుదోవ పట్టించేది, ప్రతికూలమైనదిగా అభివర్ణించిందన్నారు. ఆ సిఫార్సు ప్రకారం ఎన్ఐర్డీపీఆర్ ను డీమ్డ్ యూనివర్సిటీగా లేదా స్వయంప్రతిపత్తి కలిగిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గా మార్చాలని ఉందన్నారు. అయితే అలా కాకుండ ఎన్ఐర్డీపీఆర్ ను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ



రాజేంద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ ప్రధాన కార్యాలయం

పర్యవేక్షణలోనే ఉంచాలని గ్రామీణాభివృద్ధిపై ఏర్పడిన పార్లమెం టరీ స్థాయి సంఘం సూచించిదన్నారు. సంస్థ పాలన, పరిపాలన సంస్కరణలను పర్యవేక్షిం చడానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని పార్లమెంటు స్థాయి సంఘం ప్యానెల్ సిఫార్సు చేసిందన్నారు. సంస్థలో క్షీణిస్తున్న పనితీరు, అంతర్గత దుర్వినియోగాన్ని ప్రస్తావిస్తు డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (అకాడమిక్), రిజిస్ట్రార్, ఫైనాన్స్ అడ్వయిజర్ వంటి కీలక అధికారుల స్థానంలో ఖాళీలు ఉ ండటం సంస్థ పనితీరును బలహీనపరిచిందని నివేదికలో పేర్కొన్నారు. ఇన్ఫ్రాస్ట్రక్టర్ నిర్వాహణ పడి పోయిందని, ఉ ద్యోగుల మనో ధైర్యం దెబ్బదిన్నదని, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా రూపొందించిన పరివర్తన మార్గ ప్రణాళిక వంటి వ్యూహాత్మక ప్రణాళికలు అంతర్గత సంప్రదింపులు లేకుండ పక్కన బెట్టబడ్డాయని కమిటీ పేర్కొందన్నారు. కేంద్రీకృత, తదితర నిర్ణయాల ప్రక్రియ సంస్థ పనితీరును స్థంబింపచేసిందని కమిటీ వ్యాఖ్యానిస్తు పాలన ను స్థిరీకరించడానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరిందన్నారు. ఎన్ఐర్డీపీఆర్ లో తీవ్రమైన కొరత పై కమిటీ ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. మంజూరైన 640 పోస్టులకు గాను 419 ఖాళీగా ఉన్నాయని నివేధికలో చెబుతూ, ఈ కొరత కారణంగా ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం, పరిశోధనలు చేయడం, దేశ వ్యాప్తంగా ఉన్న 29 రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలు, 90 విస్తరణ శిక్షణ కేంద్రాలకు మద్దతివ్వడం వంటి సంస్థ సామార్థ్యంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతుందని నివేధిక లో పేర్కొన్నట్లు తెలిపారు. నిర్దిష్టకాలపరిమితితో అత్యవసరంగా ఎన్ఐఆర్డీపీఆర్ లో నియామకాలు చేపట్టాలని కమిటీ కోరిందన్నారు. విద్యా, నాయకత్వ రంగాలలో అన్ని కీలక పోస్టులను పూర్తి స్థాయి ప్రతిపాదికన భర్తీ చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ను పార్లమెంటు స్థాయి సంఘం కోరిందన్నారు. తగినంత మానవ వనరులు లేకపోతే సంస్థ తన జాతీయ విధులను నిర్వర్తించలేదని ప్యానెల్ హెచ్చరించిం దన్నారు. ఎన్ఐఆర్డీపీఆర్ లో ప్రస్తుత నాయకత్వం పై తీవ్రమైన లోపం ఉందని నివేధికలో పేర్కొంది. నాయకత్వం మార్పు అవసరమన్నారు. అంతర్గత ఆదాయ, గణనీయమైన కార్పస్ ఫండ్ ఉన్నప్పటికి జీతాలు, వైద్య రీయంబర్స్ మెంట్, విక్రేతలకు చెల్లింపులలో జాప్యాలు జరుగుతున్నాయని పేర్కొన్నారని గుర్తు చేశారు. తమ జీతాల కోసం వ్యక్తిగత అధ్యాపకులను ఆదాయాన్ని సృష్టించుకోమ్మని అడగాడాన్ని కమిటీ తీవ్రంగా ఖండించిందన్నారు. ఇది నిలకడలేనిది, మనోధైర్యాన్ని దెబ్బతీసేదిగా ఉందని పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యులు తెలి పారని ఎన్ఐఆర్డీపీర్ ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు.



## ఉండవెల్లిలో ఘనంగా బోనాల పండుగ

అలంపూర్(ఉండవెల్లి) జూలై 24(ప్రభాత ఉదయం)మండల కేంద్రమైన ఉండవెల్లిలో గురువారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆషాడమాసం చివరి రోజున హేమలాంబ ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుర వీధుల గుండ డప్పు వాయిద్యాలతో బోనాలతో ఊరేగింపుగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇందులో భాగంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉండవెల్లి ఎస్సై ఆర్. శేఖర్ బోనాల పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ అర్.శేఖర్ మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ రాష్ట్రంలో ఆషాడ మాసంలో జరుపుకునే ముఖ్యమైన పండుగ అని అన్నారు.

## ఉర్దూ టీచర్‌ను నియమించాలని వినతి పత్రం



అలంపూర్, జూలై 24(ప్రభాత ఉదయం) అలంపూర్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉర్దూ టీచర్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గురువారం విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడైన జఫ్రూలాకు వినతి పత్రం అందజేశారు. జాఫ్రుల మాట్లాడుతూ... సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు...






## ఆలయాల్లో అమావాస్య పూజలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 24(ప్రభాత ఉదయం) జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు గురువారం ఘనంగా జరిగాయి. కేటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం, ధరూర్ మండలం పెద్ద చింతరేవుల శ్రీఆంజనేయ స్వామి ఆలయం, మల్దకల్ శ్రీస్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం, బీచుపల్లి శ్రీఆంజనేయ స్వామి ఆలయం, తదితర ప్రసిద్ధ ఆలయాల్లో అమావాస్య సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అఖండ భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కేటిదొడ్డి, ధరూర్ మండల కేంద్రంతో పాటు, పరిసర గ్రామాల ప్రజలు, కర్ణాటక ప్రజలు పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయాల్లో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## అమెరికన్లకు ఉద్యోగాలపై ఫోకస్ పెట్టాలి

మొదటి పేజీ తరువాయి...




కంపెనీలు స్వదేశంలో ఉద్యోగాలు క్రియేట్ చేయడంపై ఫోకస్ పెట్టాలన్నారు. చైనాలో ఫాక్టరీలు నిర్మించడం కానీ, భారతీయ టెకీ ఉద్యోగులను రిక్రూట్ చేయడం లాంటివి వద్దన్నారు. టెకీ కంపెనీలు ప్రదర్శిస్తున్న గ్లోబల్ మైండ్‌సెట్‌ను ఆయన విమర్శించారు. ఇలాంటి విధానం వల్ల అనేక మంది అమెరికన్లు ఇబ్బంది పడుతున్నట్లు- చెప్పారు. అమెరికా స్వేచ్ఛను వాడుకుని కొన్ని టాప్ కంపెనీలు అధిక లాభాలు గడించినట్లు- తెలిపారు. ఆ కంపెనీలు విదేశాల్లో ఎక్కువగా పెట్టు-బడి పెట్టాయన్నారు. ట్రంప్ అధ్యక్ష హయంలో ఇక రోజులు ఉండవని ఆయన అన్నారు. అమెరికాలో ఉదారమైన ప్రయోజనాలను పొందుతూ చైనాలో కర్మాగారాలను నిర్మిస్తున్నాయని అమెరికా దిగ్గజ కంపెనీలపై ట్రంప్ మండిపడ్డారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ సహా కొన్ని కంపెనీలు అక్కడ భారత్ నుంచి ఉద్యోగులను నియమించుకుంటున్నాయని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చైనాలో తమ పరిశ్రమలను నిర్మించడం, అక్కడ భారత్ కు చెందిన కార్మికులను నియమించుకోవడం ద్వారా సదరు అమెరికా కంపెనీలు అమెరికన్ల విశ్వాసాన్ని కోల్పోయాయని అన్నారు. తన హయాంలో ఇక ఆ రోజులు ముగిసిపోయినట్టేనని చెప్పిన ట్రంప్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రేసులో గెలవడానికి దేశభక్తి కావాలన్నారు. ఏఐ రంగంలో అమెరికాను మొదటి స్థానంలో ఉంచాలని టెక్ కంపెనీలను ట్రంప్ కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రేసులో విజయం సాధించడానికి సిలికాన్ వ్యాలీ లోపల, వెలుపల కొత్త దేశభక్తి, జాతీయ విధేయత అవసరమని ట్రంప్ సూచించారు. అమెరికా టెక్ పరిశ్రమ చాలా కాలం వరకు రాడికల్ గ్లోబలిజాన్ని అనుసరించిందని.. ఇది మిలియన్ల మంది అమెరికన్లకు అపనమ్మకాన్ని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా వైట్ హౌస్ యాక్షన్ ఎ÷-లాన్ సహా కృత్రిమ మేధకు సంబంధించిన మూడు కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. ఈ సందర్భంగా డోనాల్డ్ ట్రంప్ అమెరికా కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్లూప్రింట్ ను విడుదల చేశారు. కీలక సాంకేతిక పరిజ్ఞానంలో చైనాపై అమెరికా ఆధిపత్యాన్ని కొనసాగించే ప్రయత్నంలో పర్యావరణ నిబంధనలను సడలించడం, మిత్రదేశాలకు కృత్రిమ మేధ ఎగుమతులను విస్తరించడం లక్ష్యంగా ఈ కొత్త కృత్రిమ మేధ బ్లూప్రింట్ ను ట్రంప్ విడుదల చేశారు. 21వ శతాబ్దాన్ని.. ఏఐ నిర్వచించే పోరాటంగా అభివర్ణించిన ట్రంప్.. చైనాతో సాంకేతిక ఆయుధ పోటీని వివరిస్తూ ఈ ప్రణాళికను విడుదల చేశారు.

# ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర



మీడియా అకాడమీలో జరిగిన జర్నలిస్టుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక



శిక్షణ పొందిన జర్నలిస్టులకు సర్టిఫికెట్లు ప్రధానం చేస్తున్న కమిషనర్, అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి



రాజేంద్రనగర్ జర్నలిస్టులకు సర్టిఫికెట్ అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



శిక్షణ పొందిన జర్నలిస్టులకు సర్టిఫికెట్ అందజేస్తున్న టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కె శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సలీం పాషా

### రంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో సమాచార ప్రత్యేక కమిషనర్ ప్రియాంక

రాజేంద్రనగర్,జులై24(ప్రభాత ఉదయం) ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేయడానికి జర్నలిజం వారధి అని,రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని సమాచార ప్రత్యేక కమిషనర్ ప్రియాంక వ్యాఖ్యానించారు.గురువారం నాంపల్లి మీడియా అకాడమీలో రంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...జర్నలిస్టుల ప్రయోజనం కోసం అవసరమైన సౌకర్యాలను అందించడంలో మీడియా అకాడమీ ప్రముఖ పాత్ర పోషిస్తుందని,అకాడమీకి అన్ని విధాలుగా మద్దతు ఇస్తామని ఆమె తెలిపారు.పాత రోజుల్లో వార్తలను అందించే పద్ధతి చాలా కష్టంగా ఉండేదని,కానీ ఇప్పుడు వాట్సాప్,సోషల్ మీడియా ద్వారా వార్తల సమాచారం అందరికీ సెకన్లలో చేరుతుందని ఆమె అన్నారు.ఎప్పటికప్పుడు ప్రజల మధ్య జరిగే ప్రతి విషయాన్ని ప్రజలకు అందించడంలో జర్నలిస్టుల పాత్ర ముఖ్యమైనదని ఆమె చెప్పారు.ఈ సమాజంలో ఏమి జరిగిందో ప్రజలకు నిజచిగా నిక్కచ్చితంగా,నిజాయితీగా తెలియజేయాలని,లభించే సమాచారం ఆధారంగానే ప్రజలు విషయాలు తెలుసుకుంటారని ఆమె సూచించారు.అకాడమీ ద్వారా మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు పెన్షన్ అందించడం,వారికి సహాయం చేయడం వల్ల చాలా మంది పిల్లల చదువుకు గొప్ప ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుందని,వారికి సంబంధించిన బీమా పథకంలో ఉన్న లోపాలను సరిదిద్ది సక్రమంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.విధుల్లో ఉండి ప్రమాదాల్లో గాయపడి పని చేయలేని వారికి ఆర్థిక సహాయం అందిస్తామని,ప్రభుత్వం అనేక ఇతర సంక్షేమ పథకాలను అందిస్తుందని,ప్రభుత్వం తన శాఖ ద్వారా జర్నలిస్టులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తుందని ఆమె వెల్లడించారు.అనంతరం పలువురు జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు.ఈ సమావేశాన్ని నిర్వహించిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ఇటీవల ప్రమాదాలకు గురై పని చేయలేని 180 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించామని తెలిపారు.అదేవిధంగా మరణించిన వారి కుటుంబ సభ్యులకు అకాడమీ రూ.3 వేల పెన్షన్ అందిస్తుందని చెప్పారు.వారి పిల్లల ఎల్‌కేజీ నుండి 10వ తరగతి వరకు చదువుకు అవసరమైన ఫీజులను అకాడమీ చెల్లిస్తుందని ఆయన అన్నారు.ఈ అకాడమీ ద్వారా ఎడిటర్లు,మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణ తరగతులు,సెమినార్లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఇప్పటివరకు 4 జిల్లాల్లో శిక్షణ తరగతులు,సెమినార్ లు నిర్వహించామని అన్నారు.మరో మూడు రోజుల్లో,నైపుణ్యం కలిగిన జర్నలిస్టులకు శిక్షణ ఇవ్వడానికి మరికొన్ని జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని,జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ప్రసంగాలలో దిశ ఎడిటర్ మార్కండేయ వార్తలు,కథనాలపై సంక్షిప్త ప్రజెంటేషన్లు ఇచ్చారు.సీనియర్ జర్నలిస్ట్ గోవింద రెడ్డి క్రైమ్ న్యూస్ పై,99 టీవీ చీఫ్ ఎడిటర్ బాలనారాయణ శిక్షణా తరగతులలో డిజిటల్ మీడియాపై ప్రసంగించారు.ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా డీఆర్‌డీఏ పిడి శ్రీలత పాల్గొని డీఆర్‌డీఏ విధానాలను,సెర్ప్ ద్వారా మహిళలకు అందించే వడ్డీ లేని రుణాలను వివరించారు.అనంతరం శిక్షణ పొందిన జర్నలిస్టులకు సర్టిఫికెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు,రంగారెడ్డి జిల్లా ప్రజా సంబంధాల అధికారి పిసి.వెంకటేశం, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీకాంత్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు ఎండి సలీంపాషా,కార్యదర్శి ఎం.సత్యనారాయణ,రాజేందర్ నగర్ టియుడబ్ల్యూజే అధ్యక్షుడు మేకల దామోదర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## సుందరంగా మీరాలం చెరువుపై ఐకానిక్ వంతెన

### రూ.430 కోట్లు కేటాయింపు



రాజేంద్రనగర్,జులై 24(ప్రభాత ఉదయం) నగర శివారులోని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రిపురం మీరాలం చెరువుపై ఐకానిక్ వంతెన కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.ఈ వంతెన నిర్మాణానికి రూ.430 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది.దీన్ని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ శాస్త్రిపురం నుంచి బెంగళూరు హైవేను కలుపుతూ ఈ ఐకానిక్ వంతెన నిర్మాణం జరగనుంది.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యాసాగర్

## వ్యవసాయ కళాశాల ఆవరణలో గల శ్రీ బంగారు పోచమ్మ దేవాలయంలో అన్నదానం

బుద్వేల్, జూలై24(ప్రభాత ఉదయం): ఆషాడ మాసంలో అమవాస్య రోజైన గురువారం రాజేం ద్రనగర్ వ్యవసాయ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీ బంగారు పోచమ్మ దేవాలయంలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్, రాజేంద్రనగర్ తాలుకా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.శ్రీనివాస్ యాదవ్, కన్వీనర్ కోళ్లమీది యాదయ్య ముదిరాజ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బంది సం ఘం అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.జయరాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందదర్భంగా దేవాలయ కమిటీ ప్రతినిధులు గోల్కొండ రాజ్కుమార్, ఎడ్లకాడి సూర్యంలు శ్రీ బంగారు పోచమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎడ్లకాడి బాబురావు, లత దం పతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు మం గళారం శ్రీనివాస్, వి.నర్సింమ్మ, గౌతమ్. నాని, ఉపేందర్, జనార్దన్, అనిల్ కుమార్, ప్రసాద్. సరస్వతి, సునంద, శారద, సక్కుబాయి, అనురాధ, జ్యోతి, హేమలత, అమృత, మీన తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంపై నిరాధారమైన ఆరోపణలు సరికాదు

### విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు



ఎం శ్రీనివాస్ యాదవ్.. ఎం రాజు.. పి భిక్షపతి

బుద్వేల్, జూలై 24 (ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంపై నిరాధారమైన కథనాలను ప్రసారం చేయడం మంచిది కాదని వర్శిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో కలసి మాట్లాడుతూ, వ్యవసాయ విశ్వవిద్యాలయం లో అవకతవకలు జరుగుతున్నాయని, ఓ టీవీ చానల్ లో పొంతన లేని కథనాలను ప్రచురిం చారన్నారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య బాధ్యతలు స్వీకరించాక 14 సంవత్సరాలుగా భర్తీ చేయని యూనివర్శిటీ అధికారుల నియామకాలను చేపట్టారని, సంవత్సరాల తరబడి మారుమూల ప్రాంతాలలో ఉద్యోగాలు చేస్తున్న వారిని నగరానికి తీసుకువచ్చి, రాజేం ద్రనగర్ లో సంవత్సరాలుగా తిష్టవేసిన అనేక మంది అధికారులను దూర ప్రాంతాలకు బదిలీ చేశారన్నారు. బీఎస్సీ అగ్రికల్చరల్ సీట్లను పెంచి, ఫీజులను తగ్గించిన ఘనత ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య కే దక్కుతుందన్నారు. గుర్తింపు లేని విశ్వవిద్యాలయాలలో వ్యవసాయ విద్య కు సంబంధించిన అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేటు విశ్వవిద్యాలయాలపై ఫిర్యాదు చేస్తున్నందుకే తప్పుడు కథనాలు ప్రసారం చేసేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పాలన పారదర్శకంగా సాగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో వర్శిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.జయరాం, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.రాజు, ఉపాధ్యక్షుడు ఎం.దశరథ్. కోశాధికారి ఎస్కే నజీర్, సంయుక్త కార్యదర్శి జి.పరమేశ్, సాంకేతిక కార్యదర్శి సులోచన, సంజీవరెడ్డి, రవీందర్రెడ్డిలు పాల్గొన్నారు.

**వ్యవసాయ విశ్వవిద్యాలయం పై తప్పుడు కథనాలు సరికాదు : బీసీ విద్యార్థి, ఉద్యోగ సంఘాలు :**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అక్రమాలు జరుగుతున్నాయని ఒక టీవీ చానల్ లో ప్రసారం కావడం వెనుక ప్రైవేటు విశ్వవిద్యాలయాల అధికారులు ఉన్నారని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వర్శిటీ బీసీ విద్యార్థి, ఉద్యోగ సంఘం నాయకులు డాక్టర్ ఉపేందర్, డాక్టర్ శైలేష్, పి.భిక్షపతిలు అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నూతన సంస్కరణలు చేపడుతు, విద్యార్థులకు ఉద్యోగులకు, అధ్యాపకులకు మేలు కరంగా పాలన సాగిస్తున్న వైస్ చాన్సలర్పై లేని పోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. దీని తాము తీవ్రం గా ఖండిస్తున్నామన్నారు..




సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న పీ ఆర్ టీ యు నాయకులు

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తాం

### పీఆర్ టీయు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి

బుద్వేల్, జూలై 24 (ప్రభాత ఉదయం): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పీఆర్టీయు ముందుండి పనిచేస్తుందని ఆ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్ రెడ్డి అన్నారు. అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పీఆర్టీయు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఉపాధ్యాయులకు పెండింగ్ లో ఉన్న డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను త్వరలో పరిష్కరించుకుంటే ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు సాయి ప్రసాద్, పీఆర్టీయు రాజేంద్రనగర్ మండల శాఖ అధ్యక్షులు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ సాగర్, అసోసియేట్ అధ్యక్షులు రవీందర్రెడ్డి, అల్లావెల్లి, ఉపాధ్యక్షుడు సత్తయ్య గౌడ్, కార్యదర్శి సి. వెంకటయ్య, క్రిష్ణారెడ్డి, చంద్రశేఖర్, భాస్కర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి, తదితరులు పాల్గొన్నారు.





ఉప్పర్ పల్లి మండల ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న బి ఆర్ ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, తదితరులు

రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న పోరెడ్డి ధర్మారెడ్డి, నాయకులు

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి మొక్కలు నాటిన పోరెడ్డి ధర్మారెడ్డి

బుద్వేల్, జూలై 24(ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఉప్పర్ పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలసి రాజేంద్రనగర్ డివిజన్ బీ ఆర్ ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, నాయకులతో కలసి కేక్ కట్ చేశారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీర్లపల్లి నవీన్ కుమార్, వి ప్రీతం కుమార్, దుంబాల ఉమా రెడ్డి, కరణం రఘు ముదిరాజ్, పీర్ల గూడెం వెంకట స్వామీ, వీర్లపల్లి మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఆగస్టు 2వ తేదీన వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం

### 519 మందికి పట్టాలు, 29 మందికి బంగారు పతకాలు, ఇద్దరికి నగదు పారితోషికాలు.. హాజరు కానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్



బుద్వేల్, జూలై 24 (ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం ఆగస్టు 2వ తేదీన రాజేంద్రనగర్ లోని వర్శిటీ ఆడిటోరియ ంలో నిర్వహించనున్నట్లు వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్నాతకోత్సవం లో 519 మంది యూజీ, పీజీ, పీహెచ్డీ విద్యార్థులకు పట్టాలను ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర గవర్నర్, వర్శిటీ చాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షత జరుగనున్న ఈ స్నాతకోత్సవంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఎల్ జాట్ ముఖ్య అతిదిగా పాల్గొని స్నాతకోత్సవ ప్రసంగం చేయనున్నారన్నారు. ఈ స్నాతకోత్సవం ద్వారా 322 మహిళలు, 197 మంది పురుషులు పట్టాలు అందుకోనున్నారని, వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పీజీ, పీహెచ్ఎ విద్యార్థులకు బం గారు పతకాలను అందజేయనునా మన్నారు. ఇదరు పీజీ, పీహెచ్డీ విద్యారులకు రూ. 25వేలు చొప్పున నగదు బహుమతిని అందజేయడం జరుగుతుందన్నారు. వీరితో పాటు 20 మంది అం డర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు కూడా బంగారు పతకాలను అందజేయడం జరుగుతుందన్నారు.



**బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు కు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్. కాబోయే ముఖ్యమంత్రి కే టీ ఆర్ అని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం పై పూర్తి అవగాహన ఉన్న నాయకుడు కే టీ ఆర్ అని అర్చన జయప్రకాష్ గుర్తు చేశారు.** - బుద్వేల్, ప్రభాత ఉదయం

## రాజేంద్రనగర్ ఈదమ్మ, భూలక్ష్మమ్మ దేవాలయంలో అన్నదానం



ఈదమ్మ భూ లక్ష్మమ్మ దేవాలయం లో అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, సామాజిక కార్యకర్త మ్యాడమ్ మధుసూదన్ తదితరులు

బుద్వేల్, జూలై24(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ ఎన్ఐఆర్డీపీఆర్ చౌరస్తాలో కొలువుదీరిన ఈదమ్మ, భూలక్ష్మమ్మ అమ్మవారి దేవాలయం ఆవరణలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు. వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిదులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కుమార్ గౌడ్, కొండకళ్ల నరేందర్ రెడ్డి ,సామాజిక కార్యకర్త మ్యాడం మధుసూదన్, కె.శ్రీదర్, వై.గోపాల్, జి.బాబు రావు, ఈ వేణు గోపాల్. యాదగిరి, బొక్క బాల్ రెడ్డి, మేకల వనితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

# అభివృద్ధిలో కేటీఆర్ పాత్ర మరవలేనిది

### మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

బుద్వేల్, జూలై 24 (ప్రభాత ఉదయం): భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ అన్నారు.కేటీఆర్ జన్మదినం సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమాన్ని గణేష్ నగర్ విద్యార్థులకు పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేశారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి మైలార్దేవ్ పల్లి డివిజన్ ఉన్నత పాఠశాలల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం బీ ఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాలతో చేపట్టారు.అనంతరం నిరుపేదలకు మంచి భోజనాన్ని అందించారు.టీఎన్జీయూస్ కాలనీ చౌరస్తాలో కేటీఆర్ చిత్రపటం ముందు కేక్ కట్ చేసి పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ...కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కేటీఆర్ హైదరాబాద్ మహానగరాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్ది ప్రపంచంలోని గొప్ప నగరాల జాబితాలో చేర్చారని అన్నారు.తెలంగాణ అభివృద్ధి కోసం అనేక ఐటీ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడంలో కేటీఆర్ చేసిన కృషిని గుర్తు చేశారు.భవిష్యత్తు రాజకీయాలను శాసించేది కేటీఆరే అని,ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను అగ్రభాగాన నిలబెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ నీచపు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్,కేటీఆర్,బీఆర్ఎస్ బ్యానర్లు ఫ్లెక్సీలు తొలగించినంత మాత్రాన తెలంగాణ ప్రజల గుండెల్లో నుంచి చెరిపేయలేరన్నారు.అది చిరస్థాయిగా వారి పేర్లు ప్రజల గుండెల్లో ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలో ఇస్తానన్న 420 వాగ్దానాలు మరిచి కేసీఆర్,కేటీఆర్,లను దూషిస్తూ రాక్షస పాలన చేస్తున్నారన్నారు.ఈ రాక్షస పాలనను అంతమొందించే రోజులు దగ్గరలో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డి.రమేష్ ముదిరాజ్,సోమ శ్రీనివాస్ గుప్తా,అక్కం రఘు యాదవ్,నోముల రాముయాదవ్,ఎడ్లకాడి సూర్యం,గుమ్మడి కుమార్ బండ రాజేష్ యాదవ్,మైసిరెడ్డి,గంజి రాజు,కొంపల్లి జగదీష్,ప్రవీణ్,ఈశ్వర్,చిరంజీవి,జగన్ ముదిరాజ్, సునీల్, భాస్కర్, వెంకటరమణ, వి.మధు,భూదేవి, సరిత, మహేష్, అరుణ రెడ్డి,శివ, మల్లేష్,ఎస్.అశోక్,సోమ సందీప్,నరేష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు ,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





బాబుల్ రెడ్డి నగర్‌లో బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదిన వేడుకలు

# డెంగ్యూ కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి

**ఫ్రైడే - డ్రై డే పక్కగా నిర్వహించాలి**

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వైద్య కేంద్రంలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



క్రీడా ప్రాంగణం పరిశీలించిన కలెక్టర్

కొత్తకోట, జూలై 24(ప్రభాత ఉదయం) వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని, నియంత్రణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని వనపర్తిజిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ కొత్తకోట మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ.డి.డి రిజిస్టరు, ల్యాబ్ ఇన్వెస్టిగేషన్ రిజిస్టరు పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, ప్రతి గర్భిణీ ఎ.ఎన్.సి నమోదు పక్కగా ఉ ండాలని సూచించారు. ప్రసవం రోజులు దగ్గరపడినప్పుడు ఆశావర్కర్లు అందుబాటులో ఉండి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరుగుచున్న సి. సెక్షన్ లు, అబార్షన్ల పై దృష్టి పెట్టి నియంత్రించాలని మెడికల్ సిబ్బందిని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల కారణంగా జలుబు, జ్వరంతో వచ్చే రోగులందరికీ డెంగ్యూ, మలేరియా వంటి రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వచ్చే జ్వరం కేసుల నివేదిక తీసుకొని వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొత్తకోటలో గత సంవత్సరం డెంగ్యూ కేసులు ఎక్కువగా వచ్చాయని, వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్రై డే రోజు డ్రై డే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో నీటి నిల్వ లేకుండా, పరిసరాలు శు భ్రంగా ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. కొత్తకోట మున్సిపాలిటీలో బస్తీ దవాఖాన కొరకు భవనం చూడాలని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ ను ఆదేశించారు.

**కొత్తకోట పెబ్బేరు జాతీయ రహదారి మిరాసపల్లి వద్ద మహిళా సంఘాల పెట్రోల్ బంక్ కు స్థల పరిశీలన**

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ కేటాయిస్తున్న నేపథ్యంలో కొత్తకోట, పెబ్బేరు మధ్య మిరాస్ పల్లి వద్ద జాతీయ రహదారి పై మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసుకునేందుకు స్థలం పరిశీలించారు. జాతీయ రహదారి పై ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పెట్రోల్ బంక్ కు కేటాయిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వెంటనే డి.పి.ఆర్ సిద్ధం చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ పి.డి ఉమాదేవి ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి డా. శ్రీనివాసులు, తహసిల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ సైదయ్య, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. సాయినాథ్ రెడ్డి, డా. పరిమళ, మెడికల్ ఆఫీసర్, పి.డి. డి ఆర్ డి ఓ ఉమాదేవి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# గద్వాలలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బి.ఆర్.ఎస్ నాయకులు



రక్తదానం చేస్తున్న బి.ఆర్.ఎస్ కార్యకర్తలు



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 24 (ప్రభాత ఉదయం) బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను గద్వాల బీఅర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బాసు హన్మంతు నాయుడు ఆధ్వర్యంలో గద్వాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి కేటీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిభిరాని ఏర్పాటు చేసి పలువురు రక్తదాతలు బ్లడ్ డునేట్ చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసు శ్యామల, జి.రాఘవేంద్ర రెడ్డి,మోనేష్,రాజా రెడ్డి,గంజిపేట రాజు,పటేల్ జనార్దన్ రెడ్డి,మాజీ ఎంపిటిసి బీచుపల్లి,అంగడి బసవరాజ్,వెంకటేశ్వర రెడ్డి,వెంకటేష్ నాయుడు,సోమశేఖర్ రెడ్డి,ఎస్.రాము నాయుడు,చక్రిదర్ రెడ్డి,పచర్ల శ్రీనివాసులు,జాంపల్లి భరత్ సింహారెడ్డి,రామకృష్ణ ముదిరాజు,శ్రీ రాములు,బాసు గోపాల్,మహాదేవప్ప,వీరేష్ గౌడ్,ముని మౌర్య,కంగారు తిమ్మప్ప,నక్క రవి,అనిల్,లోకేష్,నరసింహులు,రాజు,రవి, మరియు పార్టీ నాయకులు,కార్యకర్తలు,యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## కన్నుల పండువగా స్వామీ వారి పాగుంట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవం

కేటిదొడ్డి, జూలై 24 (ప్రభాత ఉదయం)కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అమవాస్యను పురస్కరించుకొని స్వామి వారి కళ్యాణ మహోత్సవం గురువారం కన్నుల పండువగా కొనసాగింది. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, అభి షేకం, దీక్షా హెూమం, శాంతిహెూమం, పూర్ణాహుతి, చక్ర స్నానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంత రం అలివేల మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించారు.

## ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో గోరింటాకు వేడుకలు



గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 24 (ప్రభాత ఉదయం)గద్వాలలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గురువారం గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు, అద్యాపకులు అరచేతులకు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. ప్రకృతి సిద్ధంగా లభించే గోరింటాకు ఈ మాసంలో వాడితే శరీరంలో వేడిని తొలగించడమే కాకుండా కొన్ని రకాల ఇన్ఫెక్షన్లను దూరం చేస్తుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.మీనాక్షి గోరింటాకు విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటి కన్వీనర్ సమత, అద్యాపకులు వనిత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జగన్ మోహన్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పేదల దేవుడు శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్న సీనియర్ నాయకులు ఎం భీమ్ రెడ్డి



**కొత్తకోట, జూలై 24(ప్రభాత ఉదయం) అమావాస్య సందర్భంగా పేదల తిరుపతి శ్రీ కురుమూర్తి స్వామి ని కొత్తకోట మండల సీనియర్ నాయకులు మూలమల్ల భీమిరెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ తాసిల్దార్ ఎద్దుల వెంగల్ రెడ్డి లు దర్శించుకున్నారు.**



## పరిహారం చెల్లించాలంటూ రైతుల ఆందోళన

గద్వాల జిల్లా ప్రతినిధి(గట్టు), జూలై 24(ప్రభాత ఉదయం) భారత్ మాల జాతీయ రహదారి నిర్మాణం పూర్తి అవుతున్నా పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ గురువారం గట్టు మండలం గంగిమాన్ దొడ్డి రైతులు నిరసన చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. భారత్ మాల రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూములకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులు రహదారి నిర్మాణ పనులను అడ్డుకొని రాస్తారోకో చేపట్టారు. పరిహారం చెల్లింపులో జాప్యం చేస్తున్నారని రైతులు ఆరోపించారు. గతంలో పరిహారం విషయంపై కలెక్టర్‌ను కలిసిన ఇప్పటి వరకు నిర్వాహకులు చెల్లింపులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చచెప్పారు. జిల్లా కలెక్టర్ తో పోన్ లో మాట్లాడించడంతో నిరసన విరమించారు.

## గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా బీఆర్ఎస్ నాయకుల తట్ట పార-రహదారి బాట

**కేటీఆర్ జన్మదిన సందర్భంగా గద్వాల పట్టణంలో ప్రధాన కూడలిలలో గుంతలను పూడ్చిన బీఅర్ఎస్ నాయకులు**



గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 24(ప్రభాత ఉదయం)పాలకులారా, అధికారులారా ఇప్పటికైనా మొద్దు నిద్రను వీడి అభివృద్ధి పై దృష్టి సారించాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బాసు హన్మంతునాయుడు అన్నారు.బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన పురస్కరించుకొని బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో గురువారం గద్వాల పట్టణంలోని ప్రధాన చౌరస్తా లో గుంతలమయంగా మారిన రహదారులను గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా గుంతలు పూడిచే కార్యక్రమానికి బాసు హనుమంతు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారి పై ఏర్పడిన గుంతలను బాసు హన్మంతునాయుడు, బీఆర్ఎస్ నాయకులు కంకర వేసి పూడ్చివేశారు. అనంతరం కృష్ణవేణి చౌక్ నందు కేక్ కట్ చేసి, కేటీఆర్ జన్మదిన వేడుకలు జరుపుకు న్నారు. ఈ సందర్భంగా బాసు హన్మంతు నాయుడు మాట్లాడుతూ...జిల్లా కేంద్రంలో రహదారులు గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాలకులు, అధికారులు తమకేమి పట్టన్నట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని ముఖ్య చౌరస్తాలో రోడ్డులకు గుంతలలో కనీసం కంకర వేయలేని స్థితిలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆయన ఆరోపించారు. అభివృద్ధి మంత్రంగా జపించే పాలకులు గద్వాల నియోజకవర్గ రోడ్డు ల పై దృష్టి సారించాలని కోరారు. మా ప్రజా నాయకుడు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన పురస్కరించుకొని పట్టణంలోని రహదారిపై ఏర్పడిన గుంతలను మరమ్మ తులు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు జి.రాఘ వేంద్ర రెడ్డి, మోనేష్, రాజా రెడ్డి, గంజిపేట రాజు, పటేల్ జనార్ధన్ రెడ్డి, బీచుపల్లి, అంగడి బసవరాజ్, వెంకటేశ్వర రెడ్డి, వెంకటేష్ నాయుడు, సోమశేఖర్ రెడ్డి, ఎస్.రాము నాయుడు, చక్రిదర్ రెడ్డి, కురవ పల్లయ్య, జాంపల్లి భరత్ సింహారెడ్డి, శ్రీ రాములు, బాసు గోపాల్, మహదేవప్ప, వీరేష్ గౌడ్, ఎండి.మాజ్, ముని మౌర్య, కంగారు తిమ్మప్ప, నక్క రవి,అనిల్, లోకేష్, నరసింహులు, రాజు, రవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ రిజర్వేషన్ బిల్లుకు మద్దతు కోసం ఢిల్లీలో ప్రయత్నాలు జరుపుతున్న తెలంగాణ పార్లమెంటరీ బృందంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వరంగల్ జూలై 24 (ప్రభాత ఉదయం బ్యూరో): బీసీ రిజర్వేషన్ బిల్లుకు దేశవ్యాప్తంగా మద్దతును సమీకరించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఢిల్లీలో విస్తృత స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇండియా కూటమి మిత్రపక్షాల ఎంపీల మద్దతును పొందేందుకు ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు ముందు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే , పార్లమెంటరీ పక్ష నేత రాహుల్ గాంధీ ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్కలతో కలిసి తెలంగాణ ఎంపీల బృందంతోవరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ సమాజానికి న్యాయం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బిల్లుపై పార్లమెంటులో సహకారం అందించాలని వారు కేంద్ర నేతలను విజ్ఞప్తి చేశారు.



మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్

## కేటీఆర్ సేవలు తెలంగాణ ప్రజలకు ఎంతో అవసరం

**మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్**

వరంగల్ జూలై 24 (ప్రభాత ఉదయం బ్యూరో): బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా కాజీపేట టిఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకొని కాజీపేటలో కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ కేటీఆర్ సేవలు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎంతో అవసరమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక సామాజిక సేవలు, లక్షలాదిమంది జరుపుకుంటున్న వేడుకల్లో భాగంగా చారిత్రక నగరమైన ఓరుగల్లు నగరంలో అనేక రీతిలో ఘనంగా వైభవంగా యువకులు, టిఆర్ఎస్ శ్రేణులు, ఉద్యమకారులు,మహిళలు చెట్లు నాటడం, పండ్లు పంచడం, అసంఘటిత రంగంలో ఉన్నటువంటి లక్షలాది ఆటో డ్రైవర్లకు డ్రెస్ కోడ్ డ్రెస్ ఇవ్వడం, అన్నదాన కార్యక్రమం, పేదలకు దుస్తుల పంపిణీ, ఇలా అనేక కార్యక్రమాలు చేయడం హర్షణీయము అన్నారు. అలాగే కాజీపేట లోని మానసిక వికలాంగుల కేంద్రం హౌస్ ఆఫ్ జాయిలో కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు, బ్రెడ్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 47 వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు ,బి ఆర్ ఎస్ రా పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేష్ ,జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్, 47 వ డివిజన్ అధ్యక్షులు దువ్వ కనకరాజు, 62 డివిజన్ అధ్యక్షులు పాలడుగుల శివకుమార్, మరియాల కృష్ణ, మాచర్ల ప్రభాకర్ ,వరప్రసాద్ గౌరీ శంకర్, బండి చందర్ ,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీ భూములను పరిరక్షించండి

**రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్‌కు**

**వినతి పత్రం అందజేసిన యూనివర్సిటీ ఐక్యవేదిక విద్యార్థి సంఘాలు**

**కాకతీయ యూనివర్సిటీ భూములలో**

**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించవద్దు**

**యూనివర్సిటీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలి**



వరంగల్ జూలై 24 (ప్రభాత ఉ దయం బ్యూరో): వరంగల్ నగరంలోని కాకతీయ యూనివర్సిటీలో పబ్లిక్ హియరింగ్ కు గురువారం వచ్చిన తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కమీషన్ చైర్మెన్ ఆకునూరి మురళి కీ కాకతీయ యూనివర్సిటీ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, డిఎస్‌ఏ రాష్ట్ర కో కన్వీనర్ మున్నా గణేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, బిఆర్ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షులు భైరపాక ప్రశాంత్, ఎస్ఎస్యు జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయి కుమార్, బిఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు కమ్మర్పల్లి శివ లు మాట్లాడుతూ 1976లో ఏర్పడిన కాకతీయ యూనివర్సిటీకీ అప్పటి రెవెన్యూ అధికారులు 720 ఎకరాలను ప్రతిపాదించగా, యూనివర్సిటీకి కేవలం 670 ఎకరాలను మాత్రమే అప్పగించారు. ఈ 670ఎకరాలలో ప్రభుత్వ అవసరాలకు దాదాపు 72 ఎకరాలను తీసుకుంది. అలాగే ఇతరుల ఆధీనంలో దాదాపు 40 నుంచి 50 ఎకరాల వరకు కబ్జాలకు గురైందని ఆరోపించారు. ప్రస్తుతం యూనివర్సిటీ మధ్యలో నుండి వెళ్లిన కాకతీయ కెనాల్ పరిసర ప్రాంతాలు యూనివర్సిటీ అవసరాలైన భవనాలు, ఇతర అవసరాలకు అనుకూలంగా లేవు అన్నారు. యూనివర్సిటీకీ భవిష్యత్తులో నూతన కోర్సులు ఇచ్చే అవకాశం ఉన్నందున వాటికి సరిపడా భవనాలు, విద్యార్థులకు హాస్టల్స్, రీసెర్చ్ సెంటర్లు కోసం అధిక మొత్తంలో భూమి అవసరం ఉంటుందనీ. యూనివర్సిటీ పాలకమండలి జూన్ 17వ తేదీన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కోసం 15 ఎకరాల యూనివర్సిటీ భూమిని కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయం చాలా దూరదృష్టకరమని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాన్ని ఇతర ప్రభుత్వ భూములలో నిర్మించాలని, అలాగే గతంలో విజిలెన్స్ అధికారులు చేపట్టిన సర్వే రిపోర్టును రిలీజ్ చేసి, యూనివర్సిటీకీ హద్దులు నిర్వహించి చుట్టు ప్రహరీ గోడ నిర్మించాలన్నారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను భర్తీ చెయ్యా లన్నారు. యూనివర్సిటీలో ఉన్న ఎస్ ఎఫ్ సి కోర్సులను రెగ్యులర్ చెయ్యాలనీ, యూనివర్సిటీలో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతిని కల్పించాలనీ,యూనివర్సిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 500కోట్ల నిధులు కేటాయించాలనీ విద్యార్థులకు సరిపడా నూతన హాస్టల్స్ నిర్మించాల నీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఎస్ నాయకులు పోలబోయిన రాజు, డిఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పల శివ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608

o

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608